AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
30-4-2026 (Thursday) MAIN EDITION

## ఉగ్రవాదంపై రక్షణ మంత్రి కీలక వ్యాఖ్యలు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ఉగ్రవాదంపై కీలక వ్యాఖ్యలు చేశారు. జాతీయ భద్రతా సదస్సు 2.0లో ఆయన గురువారం మాట్లాడారు. ఉగ్రవాదం ఉన్నంత కాలం సమష్టి శాంతి, అభివృద్ధి శ్రేయస్సుకు సవాలుగా నిలుస్తూనే ఉంటుందన్నారు. ఉగ్రవాదాన్ని మతపరమైన పదజాలంతో కప్పిపుచ్చి లేదా హింసాత్మక భావజాలంతో ముడిపెట్టి సమర్థించే ప్రయత్నాలు జరుగుతాయని ఆరోపించారు. ఇది ఉగ్రవాదులకు రక్షణ కవచంలా ఉండి, వారి లక్ష్యాల వైపు నెమ్మదిగా పురోగమించడానికి అవకాశం కల్పించడంతో సమానమని తెలిపారు.

## అమెరికా భయపడే ఆయుధం సిద్ధం : ఇరాన్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గడం లేదు. తాజాగా ఇరాన్ నేవీ కమాండర్ రేర్ అడ్మిరల్ షారమ్ ఇరానీ కీలక వ్యాఖ్యలు చేశారు. శత్రువు భయపడే ఒక కొత్త ఆయుధాన్ని టెహ్రాన్ త్వరలో మోహరిస్తుందన్నారు. ఈ ఆయుధంతో వారికి గుండెపోటు రాదని ఆశిస్తున్నాను అని అమెరికాను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఇరాన్ చాలా త్వరలో ప్రత్యర్థి బలగాలను తమకు సమీపంలో ఉన్న సామర్థ్యంతో ఎదుర్కొంటుందన్నారు. అది యుద్ధ రంగ గతిని మార్చగలదని పేర్కొన్నారు.

## ఇన్ఫోసిస్ లో లేఆఫ్స్ ఉండవు




**అక్షరటుడే, ఢిల్లీ:** ఏఐ కారణంగా ఐటీ రంగంలో మార్పులు వస్తున్నా తమ కంపెనీలో ఉద్యోగాల కోత ఉండదని ఇన్ఫోసిస్ సీఈవో తెలిపారు. గతేడాదీ లేఆఫ్స్ లేవని ఫ్యూచర్ లోనూ అలాంటి ఆలోచన లేదని చెప్పారు. ఏఐ వల్ల పని పరిధి పెరుగుతుందే తప్ప తగ్గదని, అందుకే ఈ ఏడాదీ 20,000 మంది ఫ్రెషర్లను తీసుకుంటామన్నారు.

## ప్రజావాణికి కొత్త గైడ్లైన్స్




**అక్షరటుడే, హైదరాబాద్:** ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమానికి సంబంధించి కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. ఇకపై హైదరాబాద్ లోని ప్రజా భవన్ లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో రాష్ట్రస్థాయి ప్రజావాణి జరుగనుంది. జిల్లాల్లో మాత్రం ప్రతి సోమవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించింది.

## వెనక్కి తగ్గిన మాజీ మంత్రి హరీశ్ రావు



**అక్షరటుడే, హైదరాబాద్:** రుణమాఫీపై గతంలో హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను మాజీ మంత్రి హరీశ్ రావు వెనక్కి తీసుకున్నారు. రుణమాఫీ సరిగా అమలు కావడం లేదని ఆయన గతంలో కోర్టును ఆశ్రయించారు. తాజాగా ఆ పిటిషన్ ను వెనక్కి తీసుకుంటున్నట్లు న్యాయస్థానానికి తెలిపారు.




తెలంగాణలో సలహాదారుల సంఖ్య పెరిగిపోతుంది. ప్రభుత్వం పలువురు నేతలు, రిటైర్డ్ అధికారులకు అడ్వైజర్ పోస్టులను కట్టబెడుతోంది. ఇప్పటికే ఆర్థిక సంక్షోభంలో ఉన్న రాష్ట్రంలో సలహాదారుల నియామకంతో ఖజానాపై తీవ్ర భారం పడుతోంది. మంత్రి, ఇతర పదవులు ఆశించి భంగపడ్డ వారిని కేబినెట్ హోదాతో ప్రభుత్వం సలహాదారులుగా నియమిస్తుండటం గమనార్హం. అయితే వీరు ఎం సలహాలు ఇస్తారు.. వాటిని ఎవరు స్వీకరిస్తారని విమర్శలు వస్తున్నాయి. – అక్షరటుడే, హైదరాబాద్

# ‘సలహాదారుల’తో ఖజానాకు భారం

- అప్పుల రాష్ట్రంలో అదనపు ఖర్చు
- పదవులు దక్కని వారిని అడ్వైజర్‌గా నియమిస్తున్న ప్రభుత్వం
- రాజకీయ పునరావాస వేదికగా మారిన వైనం

తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరో ఇద్దరు కీలక వ్యక్తులకు సలహాదారుల పదవులను కట్టబెట్టింది. కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావుతో (వీహెచ్) పాటు, తాజాగా డీజీపీగా పదవీ విరమణ చేసిన ఐపీఎస్ అధికారి బత్తుల శివధర్ రెడ్డికి నూతన బాధ్యతలు అప్పగించింది. గత ప్రభుత్వ బాటలోనే రిటైర్డ్ అధికారులకు, రాజకీయ నేతలకు వరసపెట్టి 'సలహాదారు' పదవులు ఇవ్వడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### ఇష్టానుసారంగా పదవులు

బీఆర్ఎస్ హయాంలో దాదాపు 10 మందికి పైగా సలహాదారులు ఉండేవారు. అప్పట్లో ప్రతిపక్షాలు దీనిని "నిరుద్యోగ అధికారుల పునరావాస కేంద్రం"గా అభివర్ణించాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం సలహాదారులను నియమించినప్పుడు "ఖజానా దోపిడీ" అని విమర్శించిన కాంగ్రెస్, ఇప్పుడు అదే బాటలో పయనిస్తోంది.

### ఎంత మంది ఉన్నారంటే..

రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటివరకు దాదాపు 10 మందికి పైగా సలహాదారులను నియమించింది. వీరిలో వేం నరేందర్ రెడ్డి (ప్రజా వ్యవహారాలు), షబ్బీర్ అలీ (సంక్షేమం), హర్కర వేణుగోపాల్ (ప్రోటోకాల్), మల్లు రవి (ఢిల్లీ ప్రతినిధి), ఆదిత్య నాథ్ దాస్ (నీటి వనరులు), పోచారం శ్రీనివాస్ రెడ్డి (వ్యవసాయం), సుదర్శన్‌రెడ్డి (సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు) ఉన్నారు. ఇప్పుడు వీహెచ్, శివధర్ రెడ్డి ఈ జాబితాలో చేరారు.

### వీహెచ్, శివధర్ రెడ్డికి పదవులు

కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్‌ను బీసీ సంక్షేమ సలహాదారుగా నియమించిన ప్రభుత్వం, ఆయనకు క్యాబినెట్ హోదా కల్పించింది. అలాగే ఈరోజే డీజీపీగా రిటైర్ అయిన శివధర్ రెడ్డిని మూడు ఏళ్ల పాటు భద్రతా సలహాదారుగా నియమించడం చర్చనీయాంశమైంది. 32 ఏళ్ల సర్వీసు ముగిసిన వెంటనే ఆయనకు మళ్ళీ ప్రభుత్వ కారు, బంగ్లా, భారీ సిబ్బందిని కల్పిస్తూ ఉత్తర్వులు ఇవ్వడంపై "రిటైర్డ్ అధికారులకు ఇది పునరావాస కేంద్రంగా మారిందా?" అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.






### రిటైర్డ్ అధికారులకు..

సర్వీసులో ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వకుండా, రిటైర్ అయిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను సలహాదారులుగా పెట్టుకోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే ఆదిత్య నాథ్ దాస్ (మాజీ ఐఏఎస్), ఇప్పుడు శివధర్ రెడ్డి (మాజీ ఐపీఎస్) వంటి అధికారులకు పదవులు దక్కాయి.

### బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారికి..

సలహాదారుల నియామకంలో బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యం ఇస్తుండటం గమనార్హం. గత ప్రభుత్వంలో కీలక పదవులు అనుభవించి, ఇప్పుడు కాంగ్రెస్‌లోకి చేరిన కె. కేశవరావు, పోచారం శ్రీనివా స్‌రెడ్డి వంటి వారికి కూడా సలహాదారు పదవి ఇవ్వడం రేవంత్ రెడ్డి రాజకీయ సమీకరణాల కే ప్రాధాన్య త ఇస్తున్నారని అర్థమవుతోంది. ప్రభు త్వం ఇష్టానుసారంగా సలహాదారుల పోస్టులను పెంచుకుంటూ పోవడం ఖజానాపై భారమేనన్న వాదనలు వినిపిస్తున్నాయి.

## గాంధీ భవన్ ఎదుట ఉద్యమకారుల ఆందోళన



**అక్షరటుడే, హైదరాబాద్ :** హైదరాబాద్ లోని గాంధీ భవన్ ఎదుట తెలంగాణ ఉద్యమకారులు గురువారం పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఎన్నికల సమయంలో తమకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. భిక్షాటన చేసి ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే పోలీసులు ఆందోళన చేస్తున్న ఉద్యమకారులను అరెస్ట్ చేసి అక్కడి నుంచి తరలించారు. అరెస్ట్‌పై ఉద్యమకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.

## కవిత పార్టీ టీఆర్ఎస్‌కు ఎన్నికల సంఘం ఆమోదం





**అక్షరటుడే, హైదరాబాద్ :** కల్వకుంట్ల కవిత ఈ నెల 25 కొత్త పార్టీ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆమె పార్టీకి ఎన్నికల సంఘం తాజాగా ఆమోదం తెలిపింది. అయితే పార్టీ పేరును తెలంగాణ రక్షణ సేనగా పేర్కొంది కవిత గతంలో ఉన్న తెలంగాణ రాష్ట్ర సమితిలోని సంక్షిప్త రూపం టీఆర్ఎస్ వచ్చేలా తన పార్టీ పేరు పెట్టారు. దీనిపై పలువురు బీఆర్ఎస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామన్నారు. అయితే ఎన్నికల సంఘం మాత్రం కవిత పార్టీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. టీఆర్ఎస్ పేరును అధికారికంగా కల్వకుంట్ల కవితకు ఎన్నికల సంఘం ఇచ్చింది. ఈ మేరకు ఆమోదం తెలుపుతూ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. బంజారాహిల్స్‌లోని కవిత నివాసంలో పార్టీకి అనుమతి ఇస్తూ అధికారులు లేఖ అందజేశారు. కాగా తెలంగాణ రాష్ట్ర సేన అని కవిత పేరు ప్రకటించగా.. ఎన్నికల సంఘం తెలంగాణ రక్షణ సేన పేరును ఆమోదించడం గమనార్హం.



## ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం..


**అక్షరటుడే, హైదరాబాద్ :** ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు. భువనగిరి నియోజకవర్గంలోని పలు కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులపై రైతులతో మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రైతులు చాలా రోజులుగా ఎదురు చూస్తున్నా.. ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదన్నారు. దీంతో కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత, నిర్లక్ష్య వైఖరి కారణంగా తెలంగాణలో ధాన్యం కొనుగోలు వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యంతో రైతులు రోడ్డున పడే పరిస్థితి ఉందన్నారు.

## ఏపీలో పదో తరగతి ఫలితాలు విడుదల



**అక్షరటుడే, అమరావతి:** ఆంధ్ర ప్రదేశ్‌లో పదో తరగతి ఫలితాలు విడుదల అయ్యాయి. మంత్రి నారా లోకేశ్ ఉదయం 11 గంటలకు రిజల్ట్స్ ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా 85శాతం ఉత్తీర్ణత నమోదైంది. మొత్తం 6,40,916 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. బాలురు 3,28,652 మంది, బాలికలు 3,12,264 మంది ఉన్నారు. 3,415 పరీక్ష కేంద్రాల్లో మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు పరీక్షలు జరిగాయి. పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు. మే 25 నుంచి జూన్ 4 వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు.

## కడలి తీరంలో కాక పుట్టించే డ్రెస్‌లో దంగల్ బ్యూటీ..



సమయం దొరికితే చాలు కొందరు హీరోయిన్స్ అందాలు ఆరబోస్తూ ఫాలోవర్స్ ను పెంచుకుంటున్నారు. వెకేషన్స్ కి సంబంధించిన ఫొటోలను అభిమానులతో పంచుకుంటూ మరింత పాపులారిటీ సంపాదించుకుంటున్నారు. అసలే సమ్మర్.. ఇంట్లో ఉండలేక వెకేషన్ కోసం చిల్ అవ్వడానికి బయటకు వెళ్లిన ఈ ముద్దుగుమ్మలు ఎంతోమంది ఇలా తమ అందాలను ఆరబోస్తూ బికినీ తలపించేలా డ్రెస్సులు ధరించి అభిమానులకు చెమటలు పట్టిస్తున్నారు. తాజాగా దంగల్ బ్యూటీ ఫాతిమా సనా షేక్ తన అందాలతో మరింత హీట్ పుట్టించింది. సంద్రం నడిబొడ్డున పడవ నడుపుతూ అందరి దృష్టిని తన వైపు తిప్పుకుంది. సమ్మర్ వెకేషన్ కు వెళ్లిన ఈ అమ్మడు షేర్ చేసిన ఈ ఫొటోలు నెట్టింట వైరల్ అయ్యాయి.

- అక్షరటుడే, సినిమా డెస్క్

## ఇరాన్‌కు రష్యా అండ.. యుద్ధం ముగింపుపై ట్రంప్ క్లారిటీ!



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య జరిగిన సుదీర్ఘ ఫోన్ సంభాషణ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. దాదాపు 90 నిమిషాలకు పైగా సాగిన ఈ చర్చల్లో ఇరాన్ వ్యవహారం, ఉక్రెయిన్ యుద్ధం ప్రధానాంశాలుగా నిలిచాయి. టెహ్రాన్‌పై అమెరికా మళ్లీ సైనిక చర్యలకు దిగడం ఏమాత్రం క్షేమకరం కాదని పుతిన్ స్పష్టం చేశారు. ఇరాన్‌పై దాడులు జరిగితే అది పశ్చిమాసియాతో పాటు అంతర్జాతీయ సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయన హెచ్చరించారు. అయితే, ఇరాన్‌తో కాల్పుల విరమణను పొడిగించాలన్న ట్రంప్ నిర్ణయాన్ని పుతిన్ స్వాగతించారు. దౌత్య పరమైన చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడానికి రష్యా ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఆయన పునరుద్ఘాటించారు. ఇరాన్ వద్ద ఉన్న భారీ యురేనియం నిల్వల గురించి కూడా ఇరువురు నేతలు చర్చించుకున్నారు. ఇరాన్ లోని శుద్ధి చేసిన యురేనియం నిల్వలను తీసుకునేందుకు పుతిన్ సానుకూలత వ్యక్తం చేసినట్లు ట్రంప్ వెల్లడించారు. ఇది ఇరాన్ అణ్వాయుధ తయారీకి అడ్డుకట్ట వేసే దిశగా ఒక కీలక పరిణామంగా భావిస్తున్నారు.

## తప్పుడు మ్యాప్ వివాదం.. తలవంచిన నేపాల్ ఎయిర్‌లైన్స్!




**అక్షరటుడే, న్యూఢిల్లీ:** భారత భూభాగమైన జమ్మూకశ్మీర్‌ను తప్పుగా చూపించిన వ్యవహారంలో నేపాల్ ఎయిర్‌లైన్స్ ఎట్టకేలకు దిగివచ్చింది. భారత సార్వభౌమాధికారానికి భంగం కలిగించేలా ఉన్న మ్యాప్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేసినందుకు గాను భారత్‌కు బహిరంగ క్షమాపణలు తెలియజేసింది. బుధవారం నేపాల్ ఎయిర్‌లైన్స్ తన నెట్‌వర్క్ మ్యాప్‌ను సోషల్ మీడియాలో పంచుకుంది. అయితే, ఈ మ్యాప్‌లో భారత కేంద్రపాలిత ప్రాంతాలైన జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌లను పాకిస్థాన్ భూభాగంలో ఉన్నట్లుగా చూపించింది. ఈ పోస్ట్ కాస్తా వైరల్ కావడంతో భారత నెటిజన్లు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నేపాల్‌పై దౌత్యపరమైన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు డిమాండ్ చేశారు. పరిస్థితి తీవ్రతను గమనించిన నేపాల్ ఎయిర్‌లైన్స్ వెంటనే అప్రమత్తమైంది. వివాదాస్పద పోస్ట్‌ను తొలగించడమే కాకుండా, అంతర్జాతీయ సరిహద్దుల గుర్తింపులో పొరపాటు జరిగిందని అంగీకరించింది.